క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఎంపీ వేమిరెడ్డి


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను ఎమ్మెల్యే అందజేశారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సీసీఎల్ సేవలు అభినందనీయం


ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలోని సీసీఎల్ కాఫీ పరిశ్రమ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రశంసించారు. పరిశ్రమ పరిసర గ్రామాల్లో ఇటీవల రూ.70లక్షల వ్యయంతో రోడ్లు, అదనపు కార్యాలయ గదులు నిర్మించడం పట్ల సీసీఎల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ ప్రభుత్వం ప్రశంసా పత్రాన్ని పంపింది. దీన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా పరిశ్రమ పీఆర్వో కిషోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

వైఎస్సార్ బీమా చెల్లింపు


నగదును అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నారాయణవనం: ఆటో డ్రైవర్ నాగలింగం కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సోమవారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం నాగలింగం మృతి చెందాడు. ఆయన భార్య కుమారికి కోఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, వార్డు సభ్యుడు సొరకాయలు తక్షణ సాయం అందించారు. వారు మాట్లాడుతూ మిగిలిన రూ.90 వేలు చెక్కు రూపంలో అందుతున్నారు. నారాయణవనం-3 వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి, సుబ్రమణ్యంశెట్టి, ప్రేం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నారాయణవనం: నారాయణవనం మండల పరిషత్ సర్వసభ్య సమాశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించవచ్చన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

కిషోర బాలికలకు అవగాహన

రేణిగుంట: రేణిగుంట సమీపంలోని తిరుపతి కేంద్రీయ విద్యాలయం-2లో సోమవారం కిషోర బాలికలకు పీఎం-శ్రీపథకంపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.భారతి పాల్గొని యుక్త వయస్సులో వచ్చే శారీరక మార్పులు, జాగ్రత్తలు, బాల్య వివాహాలు-అనర్థాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా ఉపాధ్యా యులు లలితమ్మ, రాజేశ్వరి, ప్రియాంక, రేవతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


దొరైరాజు(ఫైల్)

నాగలాపురం: మండలంలోని కొట్టకాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దొరైరాజు సోమవారం మృతిచెందారు. పలువురు పార్టీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉచిత వైద్య శిబిరం



ఏర్పేడు: మండలంలోని వికృతమాల లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో సోమవారం పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలోని సుమారు 40 మంది వృద్ధులు, వికలాంగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి శిల్ప, ట్రస్ట్ చైర్మెన్ సాయిదమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరి కళ్లల్లో మట్టి కొట్టాలని?

ఈ చిత్రంలో కనిపిస్తున్నది శ్రీకాళహస్తి మండలం, మద్దిలేడు గ్రామ చెరువు. ఇక్కడ మట్టిని తవ్విన దాఖలాలు లేవు. కానీ ఓ పచ్చ పత్రికలో మాత్రం మద్దిలేడు చెరువులో జేసీబీల సహాయంతో మట్టిని లోడేస్తున్నారంటూ తప్పుడు రాతలతో ఓ కథనాన్ని ప్రచురించింది. విచ్చలవిడిగా తరలిస్తున్నారంటూ తన పిచ్చిన పరాకాష్టకు చేర్చింది.



- మట్టి తరలింపుపై పచ్చమీడియాలో అసత్య కథనాలు
- మద్దిలేడు చెరువులో అసలు తవ్వకాలే లేవు
- అయినా తరలిస్తున్నారంటూ తప్పుడు రాతలు
- విస్మయం వ్యక్తం చేస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి: పచ్చ పత్రిక పిచ్చిరాతలు రాయడం అలవాటైపోయింది. అధికార పార్టీపైనా.. ఆ పార్టీ నేతలపైన ఏదోరకంగా బురదజల్లాలని కుయుక్తులు పన్నుతోంది. ఇందులో భాగంగానే ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు కల్పిత కథలు అల్లి ప్రజల కళ్లకు గంతలు కడుతోంది. ఇలాంటిదే సోమవారం చోటు చేసుకుంది. ఆ పత్రికలో ×మట్టికొట్టి..కాసులు కొల్లగొట్టి¥ అంటూ పతాక స్థాయిలో ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఇందులో వాస్తవాలేంటో మీరే చదవండి..

మట్టితోలిన ఆనవాళ్లెక్కడ?

శ్రీకాళహస్తి పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో మద్దిలేడు గ్రామ చెరువు ఉంది. దీని పరిధిలో సుమారు 60 ఎకరాల వరకు సాగుభూము లున్నాయి. ఇటీవల వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం చెరువు ఖాళీగా ఉంది. చెరువులో నుంచి మట్టితోలిన ఆనవాళ్లు ఎక్కడా కనిపించ లేదు. కనీసం చెరువులోకి ట్రాక్టర్ దిగిన దాఖలాలు కూడా లేవు. కానీ పచ్చపత్రిక మద్దిలేడు చెరువులో జేసీబీలతో తవ్వాకాలంటూ తప్పుడు వార్తను ప్రచురించింది. దీనిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మట్టిని ఎక్కడి నుంచి తేవాలి?

నాయుడుపేట- పూతలపట్టు ఆరు లేన్ల పనులు జోరందుకున్నాయి. ఈ రోడ్డు నిర్మాణాన్ని మెగా ఇంజినీరింగ్ సంస్థ ముందుకు నడిపిస్తోంది. రోడ్డుకు అవసరమైన మట్టిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో ఆ సంస్థ దగ్గర్లోని చెరువులు, ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తోంది. దీనికి ఇప్పటికే కోట్లాది రూపాయలు చెల్లించింది. కానీ పచ్చపత్రిక కళ్లు మూసుకుని అక్రమంగా తరలిస్తున్నారంటూ పిచ్చిరాతలు రాస్తోంది. దీనిపై మెగా సంస్థ అధికారి ఒకరు మాట్లాడుతూ 'మేము నిబంధనలకనుగుణంగానే మట్టి తరలిస్తున్నాం. ఎక్కడా అక్రమంగా తవ్వకాలు చేపట్టడం లేదు. కానీ కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు అక్రమంగా తరలిస్తున్నామంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నాయి. ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదు. రోడ్డు నిర్మాణానికి నిబంధనలకనుగుణంగానే దగ్గర్లోని చెరువులు.. గుట్టల్లో నుంచి మట్టి తోలుకుంటున్నాం. అయినా వాటికి గిట్టడంలేదేమో. ఇక మేము మట్టిని ఆకాశంలో నుంచి తవ్వుకోవాల్సిందే'నంటూ వ్యంగ్యంగా మాట్లాడడం గమనార్హం. క్యూబిక్ మీటరుకు ప్రభుత్వానికి రూ.240 చెల్లించి మట్టి సేకరిస్తున్నట్టు వెల్లడించారు.

మట్టి భోంచేసింది టీడీపీ నేతలే

గతంలో చెరువుల అభివృద్ధి – సంరక్షణను టీడీపీ గాలికొదిలేసింది. గత 30 ఏళ్లుగా చెరువుల్లో ఎక్కడబడితే అక్కడ జేసీబీలను పెట్టి మట్టితోడేయడం అలవాటు చేసింది. అక్కడి నేతలు, కార్యకర్తల కనుసన్నల్లో ఇతరప్రాంతాలకు సైతం మట్టి యథేచ్ఛగా తరలించడం షరామామూలుగా మారింది. నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టి తన అనుచరులకు దోచిపెట్టింది. ఇది చాలదన్నట్టు చెరువుల విస్తీర్ణం పెంచే ఉద్దేశంతో చెరువు కట్టలపై చెట్లు తొలగించి కొత్త కట్టల ఏర్పాటు పేరుతో లక్షల రూపాయలు కొల్లగొట్టింది. గతంలో కళ్లు మూసుకున్న పచ్చమీడియా ఇప్పుడు చెరువుల్లో ఏదో జరిగిపోతోందంటూ తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. ప్రతిపక్ష పార్టీ నేతలకు వత్తాసు పలుకుతూ తన పైత్యాన్ని ఎగజిమ్ముతోంది. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు.

అది అబద్ధం

శ్రీకాళహస్తి మండలం, మద్దిలేడు చెరువు చెరువులో ఎక్కడా మట్టి తోలడంలేదు. అసత్య కథనాలు ప్రచురిస్తే ప్రజలు ఊరుకోరు. పత్రికలంటూ వాస్తవాలు చెప్పేలేగానీ.. ఇలా ఇష్టమొచ్చినట్టు రాస్తే ప్రజలే బుద్ధి చెబుతారు.
– నైనారు గురవయ్య, మద్దిలేడు, సర్పంచ్

అనుమతులతోనే మట్టి తరలింపు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ఆరులేన్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి అవసరమైన మట్టి తరలింపుకు మెగా కంపెనీవారు అనుమతులు కోరారు. ఈ నేపథ్యంలో మైనింగ్‌వారిని సంప్రదించి వారి అనుమతితోనే గుండెలుగుంట చెరువులో 15వేల క్యూబిక్‌మీటర్లు తీసుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.240 చెల్లిస్తున్నారు. అలాగే కాసరం చెరువులో 15వేలు క్యూబిక్‌మీటర్లు, ఏర్పేడు పరిధిలో 25వేల క్యూబిక్ మీటర్ల మట్టి తోడుకోవడానికి అనుమతి పొంది ఉన్నారు. ఎక్కడా అనధికారికంగా మట్టి తరలించడంలేదు.
– మదనగోపాల్, ఇరిగేషన్ ఈఈ

సమస్యల పరిష్కారమే ధ్యేయం


గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా తాను ప్రజలకు అందుబాటులో ఉండి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించానని పేర్కొన్నారు. అవాస్తవ ఆరోపణలు చేసే టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్ కుటుంబం 3దశాబ్దాల పాటు ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. వారికి సమస్యలను ఎక్కడ విన్నవించాలో కూడా తెలియని పరిస్థితి ఉండేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే కార్యాలయం ఏర్పాటు చేశానని, తాను, తన కుమార్తె పవిత్రారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సువర్ణ పరిపాలనతో ఎక్కడి వెళ్లినా ప్రజాదరణ లభిస్తోందని, ఇందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమమే నిదర్శనమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలవారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. మన రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. చిన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈపర్యటనలో ఎమ్మెల్యేకు స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది.

నాయకులు అంజూరు తారక శ్రీనివాసులు, పగడాల రాజు, షేక్ సిరాజ్, మున్నా, జయశ్యామ్, నాని, హరినాయుడు, మస్తానయ్య, శ్రీకృష్ణ, పంతులు, శివకుమార్‌యాదవ్, గోరా, నంద, మునిరెడ్డి, జయగోపాల్, మల్లికార్జునగౌడ్ మురళీయాదవ్, కంత ఉదయ్ పాల్గొన్నారు.

ప్రభుం ప్రాణనాథం!

నాగలాపురం: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా శ్రీసర్వమంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచే మహిళలు ఆలయంలో నేతి, పిండి దీపాలను వెలిగించారు. ప్రదోష మండపంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ప్రత్యేకంగా అయ్యప్పమాల ధారణ భక్తులు రావడంతో రద్దీ పెరిగింది. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం చైర్మన్ బాలాజీరెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాలక మండలి సభ్యులు ఏ.అజయ్ కుమార్, జి.మునివేలు, ఎస్.మంజుల, ఉమాపతి, తదితరులు పర్యవేక్షించారు.

సులభరీతిలో బోధన సాగాలి

బుచ్చినాయుడుకండ్రిగ: తరగతి గదిలో విద్యార్థులకు సులభరీతిన అర్థమయ్యేలా బోధన చేస్తూ, అన్ని సబ్జెక్టుపై మక్కువ కల్పించాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని కల్లివెట్టు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, తప్పులను సరిదిద్దాలని తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



సత్యవేడు: మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి, బీఎన్‌కండ్రిగ : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్యవేడు: రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం కాళమనాయుడుపేట సచివాలయం వద్ద 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం మండలంలో ఉద్యమంలా సాగుతోందన్నారు. జగన్న ప్రభుత్వంలో పేదోడు బాగుపడితే చంద్రబాబు ప్రభుత్వంలో ధనవంతులు బాగుపడ్డారని, భవిష్యత్ బాగుండాలంటే జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు ఇవ్వాలని కోరారు. కాళమనాయుడుపేట, కొత్తమారికుప్పం, నరసరాజు అగ్రహారం పరిధిలో వివిధ అభివృద్ధి పథకాల కింద రూ.23.32 కోట్లు లబ్ధిదారులకు నగదు అందిందన్నారు. అంతకు ముందు సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రెడ్డి, సర్పంచులు జయ, నాగమ్మ, బాలాజీ, సచివాలయ కన్వీనర్ గోవిందస్వామి, సచివాలయ సెక్రటరీలు కే, కుముద, ఎం. లోకేష్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కుక్కంబాకం గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫేస్టోలో 99.5 శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. అభివృద్ధిలోనూ ముందున్నామనే నిజంతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమమే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమమని పేర్కొన్నారు. నాలుగున్నర ఏళ్లల్లో కుక్కంబాకం గ్రామ సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కలిపి రూ.19 కోట్ల 80 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, సింగిల్‌విండో చైర్మన్ హరనాథ్‌రెడ్డి, సర్పంచ్ డిల్లీబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు కారణిహరిబాబు, నాయకులు సుబ్రమణ్యం, భాస్కర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి నందిని, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన జగనన్నకే సాధ్యం

నాగలాపురం: కుల, మత, పార్టీలకతీతంగా పథకాలను అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు తెలిపారు. మండలంలోని నందనం సచివాలయంలో సోమవారం స్థానిక సర్పంచ్ అమరేశ్వరి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భావితరాల బంగారు భవితకు పునాది వేసే దిశగా ముఖ్యమంత్రి పాలన సాగుతోందని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగాలంటే మరోమారు ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలని కోరారు. పథకాల బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, వైద్యాధికారి విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, నాయకులు అలగేశన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


నాగలాపురం: మాట్లాడుతున్న అపరంజిరాజు


పిచ్చాటూరు: పథకాల బోర్డు ఆవిష్కరణ

రామగిరి సచివాలయం పరిధిలో ..

పిచ్చాటూరు: రాష్ట్ర ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు రావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని రామగిరి సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును, గ్రామంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామగిరి సచివాలయ పరిధిలో సంక్షేమానికి, అభివృద్ధికి రూ.19.90 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. అనంతరం కిట్‌లను పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు, ఉపాధ్యక్షుడు సు బ్రమణ్యం, సర్పంచ్‌లు రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీ సీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, సచివాలయ కన్వీనర్ శేఖర్, నాయకులు మోహన్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం


బీఎన్‌కండ్రిగ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటిఆదిమూలం

సత్యవేడు: సూళ్లూరుపేట నియోజకవర్గం,తడ మండలానికి మత్స్యకార భరోసా కార్యక్రమానికి మంగళవారం విచ్చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులతో జనసమీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్యవేడు మండలం స్వచ్ఛందంగా తరలివచ్చే జనం కోసం 20 బస్సులు కేటాయించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ కె. చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె. శ్యాంప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, గురుప్రసాద్, జిల్లా మహిళా మెంబరు మస్తానీ, రవిరెడ్డి, పునిత్ కుమార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: సూళ్లూరుపేటకు విచ్చేస్తున్న సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ సుబ్బలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గానికి సమీపమైన తడ పర్యటనకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షించారు. పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ సమష్టి బాధ్యత


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రేణిగుంట: బాలల హక్కుల పరిరక్షణ సమష్టి బాధ్యతని ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ అన్నారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన క్రై సంస్థ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వారం రోజులుగా బాలల హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సోమవారం రేణిగుంట మండలం రేణిగుంట బాలికోన్నత పాఠశాల, గుత్తివారిపల్లె హైస్కూల్ విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలకార్మిక వ్యవస్థపై వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. సామాజిక రుగ్మతలు, దురాచారాలను విడనాడాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, విష్ణువర్ధనం, ఇందిరాంబ, యునైటెడ్ వే కోఆర్డినేటర్ సతీష్, ప్రగతి సిబ్బంది జయలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.

ఏర్పేడు: బాలల హక్కులను పరిరక్షిద్దామని ఎంఈఓ-2 దయాకర్ అన్నారు. సోమవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ర్యాలీ, వ్యాస రచన, వక్తృత్వ, క్రీడల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ హక్కులను వినియోగించుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చిన్నతనం నుంచి సత్ప్రవర్తన అవసరమని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీషా, ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్, సుబ్రమణ్యం, రామచంద్ర పాల్గొన్నారు.

ఆదిలోనే గుర్తిస్తే క్యాన్సర్ నయం


లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమాదేవి గౌరినేని

రేణిగుంట: క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని అన్నారు. మండలంలోని కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో సోమవారం ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవన విధానం, ఆహార పంటలలో రసాయన ఎరువులు విరివిగా వాడడం, సరైన శారీరక శ్రమ లేకపోవడం వల్ల అనేక జబ్బులు వస్తున్నాయని, వాటిలో క్యాన్సర్ కేసులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలిపారు. తమ ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపిక్ చికిత్స ద్వారా 95శాతం ఫలితాలు వస్తున్నట్లు వివరించారు. రూ.999కే ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌కు సంబంధించి అన్ని టెస్ట్‌లు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రూ.999 ప్యాకేజీ లోగోను ఆవిష్కరించి బెలూన్లు ఎగురవేశారు. సర్జికల్ గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ మునికృష్ణ, ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు, పీఆర్‌వో మునినాథం పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఏర్పేడు: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ది శందాసని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. 25 మందికి వేరుశెనగ, నువ్వుల ఉండలు, బిస్కెట్స్, ఖర్జూరం, వివిధ రకాల పండ్లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. యువతేజం ట్రస్ట్ వ్యవస్థాపకుడు కరీముల్లా, అధ్యక్షుడు సతీష్, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, హెచ్ఎం శోభారాణి, భవిత కేంద్రం స్కూల్ అసిస్టెంట్ స్వర్ణలత పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ అజయ్ కుమార్ కథనం మేరకు బొక్కసంపాళెంకు చెందిన మునీంద్ర అక్రమంగా మద్యం విక్రయిస్తు న్నట్లు చేస్తున్నట్లు రహస్య సమాచారం అంద డంతో సిబ్బందితో కలిసి అతని ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 63 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, మునీంద్రను అదుపులోకి తీసుకున్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి


బహుమతులను అందిస్తున్న సర్పంచ్ నగేషం


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రేణిగుంట: పుస్తక పఠనం మంచి లక్షణమని, విద్యార్థులు చిన్నతనం నుంచే అలవాటు చేసుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని రేణిగుంట సర్పంచ్ నగేషం కోరారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం రేణిగుంట శాఖ గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్ కూడా అందుబాటులో ఉంచి విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు తోడుగా నిలుస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు హసన్, విజ్ఞాన వేదిక కన్వీనర్ రమణ, ఉపాధ్యాయులు అరుణ, నిర్మల, సుజాత, మునిరత్నం, రవి, గ్రంథాలయాధికారిణి శ్రీముఖి, తహరా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

నాగలాపురం: పట్టణంలోని గ్రంథాలయ శాఖలో వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారంతో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై, ఎంపీపీ సింధు, ఉప సర్పంచ్ సునీత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు, వేలన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు

నారాయణవనం: గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు. వారోత్సవాలలో చివరి రోజైన సోమవారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని దినచర్యగా చేసు కోవాలని, దిన పత్రికలను చదవడం ద్వారా కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించవచ్చని తెలిపారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందించారు. లైబ్రేరియన్ జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. పుస్తక పఠన ప్రాముఖ్యతను గ్రంథాలయ అధికారిణి లావణ్య వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.